క్లుప్తంగా

6వ తేదీ వరకు 144 సెక్షన్ అమలు


శివరామకృష్ణారెడ్డి, సీఐ

మేదరమెట్ల: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అద్దంకి రూరల్ సర్కిల్ పరిధిలో గల మేదరమెట్ల, కొరిశపాడు, జే.పంగులూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఈనెల 6వ తేదీ వరకు 144 సెక్షన్‌తో పాటు 30 యాక్టు అమలులో ఉంటుందని సీఐ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. ఈసందర్భంగా నలుగురు కంటే ఎక్కువ మంది గుంపులుగా ఉండటం చేయకూడదని 3వ తేదీ రాత్రి నుంచి 4వ తేదీ రాత్రి వరకు సర్కిల్ పరిధి రెస్టారెంట్లు, హోటళ్లు, లాడ్జిలు అన్నీ మూసి వేయాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా బహిరంగ భోజనాలు, సంబరాలు చేయరాదని లాడ్జిల్లో కాని కల్యాణ మండపాల్లో కానీ వేరే ప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఉండరాదన్నారు. ఎవరైనా రెచ్చగొట్టేలా మాట్లాడటం, బాణాసంచా కాల్చడం చేయరాదని అలాంటి వాటికి అనుమతులు లేవన్నారు. ఎవరైనా పోలీసుల ఉత్తర్వులను పాటించకుంటే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు రౌడీషీట్ ఓపెన్ చేస్తామని సీఐ హెచ్చరించారు.

ఘనంగా హనుమత్ కల్యాణం


వీరాంజనేయస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చీరాల అర్బన్: హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక బోస్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి దేవాలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఉదయం దేవాలయ ప్రాంగణంలో సువర్చలా సమేత హనుమత్ కల్యాణాన్ని నిర్వహించారు. పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. ఆలయ అర్చకులు తమిరిశ శ్రీనివాస చక్రవర్తి, తమిరిశ వంశీకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. సాయంత్రం స్వామివారి నగరోత్సవాని నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తలు పర్యవేక్షించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరంతో విజ్ఞానం


వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించవచ్చని సంతమాగులూరు శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం సంతమాగులూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన సదస్సు నిర్వహించారు. శిబిరంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గేమ్స్ నేర్పించారు. కార్యక్రమంలో 21 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- గెలుపు మాదేనంటున్న వైఎస్సార్ సీపీ
- డీలా పడిన టీడీపీ
- చీరాల నియోజకవర్గంలో 16 రౌండ్లు 14 టేబుళ్ల ఏర్పాటు


ఈపురుపాలెంలో జీపుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



చీరాలలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్)

చీరాల టౌన్: గత నెల 13న జరిగిన సార్వత్రిక పోరులో గెలుపోటముల ఫలితం మరికొన్ని గంటల్లో తేలనుంది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి జరగనున్న ఓట్లు లెక్కింపులో ఉదయం 12 గంటల కల్లా పోటీలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. బాపట్ల జిల్లా పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో ఓట్లు లెక్కింపునకు బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించనున్నారు. సార్వత్రిక ఎన్నికల ఓట్లు లెక్కింపుకు సర్వం సిద్ధం చేశామని చీరాల నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఓట్లు లెక్కింపును మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బాపట్ల జిల్లా కేంద్రంలోని బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలోని సీ బ్లాకులో నిర్వహిస్తున్నామని తెలిపారు. బాపట్ల జిల్లాలో అసెంబ్లీ అభ్యర్థుల ఎన్నికల కౌంటింగ్‌లో 15 రౌండ్లలో మొదటి ఫలితం బాటప్ల నియోజకవర్గ నుంచి వెలువనుంది. రెండో ఫలితం చీరాలదే. చీరాల ఎన్నికల ఫలితం లెక్కింపునకు 16 రౌండ్లులో ఫలితం తేలుతుందని, కౌంటింగ్‌కు 14 టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు, సర్వీస్ ఓట్లు లెక్కింపునకు మరో నాలుగు టేబుళ్ల ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో అభ్యర్థి 14 మందిని కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవచ్చన్నారు. కౌంటింగ్‌కు పోటీ చేసిన అభ్యర్థులు, వారి కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం ఆరు గంటలకల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రతి ఏజెంట్‌కు ప్రత్యేకంగా కౌంటింగ్ పాస్ అందిస్తామని, ఓట్లు లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు నిషేధించామన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, ఈసీ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. చీరాల ఎమ్మెల్యే స్థానానికి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కరణం వెంకటేష్, టీడీపీ అభ్యర్థిగా ఎంఎం కొండయ్య, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమంచి కృష్ణమోహన్‌తో పాటుగా స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీలకు చెందిన వారు మొత్తం 15 మంది పోటీ చేశారు. చీరాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 202711 మంది ఉన్నారు. వీటిలో పురుషులు 98,729 మంది, స్త్రీలు 103958 మంది, థర్డ్ జండర్ 24 మంది ఉన్నారు. గతనెల 13న జరిగిన ఎన్నికలలో నియోజకవర్గంలో ఉన్న 202711 మంది ఓటర్లలో 167466 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ 82.61 శాతంగా నమోదైంది. చీరాల నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల, వేటపాలెం మండలాల్లో ఏర్పాటు చేసిన 218 పోలింగ్ కేంద్రాల్లో 167466 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో పురుష ఓటర్లలో 98729 మందికి గాను 81772 మంది ఓట్లు వేశారు. అలానే మహిళా ఓటర్లు 103958 మందిగా 85681 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. చీరాల నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలలో పురుషుల కంటే స్త్రీలు 3909 మంది అధికంగా ఓట్లు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా బుధవారం వరకు నియోజకవర్గంలో 144 సెక్షన్, 30 యాక్టు అమలులో ఉంటుందని, ర్యాలీలు, బాణాసంచాలు కాల్చడం నిషేధమని ప్రజలందరు ఇళ్లల్లోనే ఉండాలని పోలీసు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. డ్రోన్ కెమెరాలు, పోలీసులు ప్రత్యేకంగా ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక గ్రామాలు, వార్డుల్లో బందోబస్తులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పర్చూరు నియోజకవర్గంలో 22 రౌండ్లు..

కారంచేడు: పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలు మే 13వ తేదీన వేసిన ఓట్లు ఇప్పటి వరకు బాపట్ల ఇంజనీరింగ్ కాలేజ్‌లో భద్రపరిచారు. వాటిని మంగళవారం ఉదయం 8గంటల నుంచి లెక్కింపునకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసారు. నియోజకవర్గంలోని కారంచేడు మండలంలో 32518 ఓట్లకు గాను 27849 ఓట్లు పోలయ్యాయి. పర్చూరు మండలంలో 42684 ఓట్లకు గాను 37838 ఓట్లు, ఇంకొల్లు మండలంలో 40445 ఓట్లకు గాను 34788 ఓట్లు, మార్టూరు మండలంలో 58662 ఓట్లకు గాను 51043 ఓట్లు పోలయ్యాయి. యద్దనపూడి మండలంలో 21525 ఓట్లకు గాను 19596 ఓట్లు, చినగంజాం మండలంలో 33499 ఓట్లకు గాను 29150 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 229333 ఓట్లకు గాను 87.32 శాతం ఓట్లతో 200264 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 14 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు ఆర్ఓ కార్యాలయ వర్గాలు తెలిపాయి. 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం పార్లమెంట్ నియోజకవర్గానికి మైక్రో అబ్జర్వర్లు 20 మంది, లెక్కింపునకు అవసరమైన సిబ్బంది 36 మందిని నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గ ఓట్లను లెక్కింపు కోసం మైక్రో అబ్జర్వర్లుగా 24 మందిని, ఓట్ల లెక్కిపు సిబ్బంది 48 మందిని నియమించారు. వీరందరికీ ఇప్పటికే లెక్కింపుపై పూర్తిస్థాయి శిక్షణను అందించారు. సాయంత్రంలోగా ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే అవకాశాలున్నాయని అధికారులు చెప్తున్నారు. బరిలో వైఎస్సార్ సీపీ తరపున యడం బాలాజీ, టీడీపీ తరపున ఏలూరి సాంబశివరావులు ఉన్నారు.

22 రౌండ్లలో అద్దంకి నియోజకవర్గ ఓట్ల లెక్కింపు

అద్దంకి: గత నెల 13వ తేదీన నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా లెక్కింపు కార్యక్రమం మంగళవారం బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. లెక్కింపు కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. పటిష్ట బందోబస్తు మధ్య నేటి ఉదయం 8 గంటలకు కౌంటింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అద్దంకి అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపును 22 రౌండ్లలో పూర్తిచేయనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. ఆ తరువాత 14 టేబుల్స్‌పైన 22 రౌండ్లలో ఈవీఎంలను బటన్ నొక్కి ఆయా పార్టీల ఏజంట్ల సమక్షంలో డిస్‌ప్లేతో అధికారులు కౌంట్ చేయనున్నారు. రౌండ్ రౌండ్‌కు ఫలితాన్ని హాజరైన మీడియా ప్రతినిధులకు తెలియజేయనున్నట్లు అధికారులు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,44,057 మంది ఒటర్లు ఉండగా, వారిలో 2,15,077 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని 298 పోలింగ్ కేంద్రాల ద్వారా ఈ ఓట్లు ఈవీఎంలలో నిక్షిప్తం అయ్యాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసు శాఖ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం 2 గంటల నుంచి బుధవారం ఉదయం 11 గంటల వరకు పట్టణంతోపాటు, మండలంలోని వివిధ గ్రామాల్లోని అత్యవసరాలైన పాలు, మెడికల్ దుకాణాలు మినహా మరే వ్యాపార దుకాణాలు తెరవడానికి వీలు లేదని హోం శాఖ ఆదేశాలు జారి చేసింది. వైఎస్సార్ సీపీ తరపున పానెం చిన హనిమిరెడ్డి, టీడీపీ తరపున గొట్టిపాటి రవికుమార్‌లు బరిలో ఉన్నారు.


అద్దంకిలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

జోరు మీద ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు..

ఒకటో తేదీన విడుదల చేసిన సర్వేల్లో అత్యధిక సర్వేలు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అత్యధిక సీట్లు సాధిస్తుందని చెప్పాయి. ఇక లెక్కింపే తరువాయి గెలుపు మాదేనని వైఎస్సార్ సీపీ వర్గాలు సంబరాలకు రెడీ అవుతున్నాయి. అయితే తామే గెలుస్తామని కూటమి ధీమా వ్యక్తం చేస్తుంది. అద్దంకి లోనూ వైఎస్సార్ సీపీ గెలుపొందటం ఖాయమని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఏది ఏమైనా ఈ రోజు మధ్యాహ్నం ప్రాంతానికి అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంల నుంచి బయటకు రానుంది.

మానవ తప్పిదాల వలనే పర్యావరణం కలుషితం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న భానుచంద్రమూర్తి

చీరాల అర్బన్: మానవ తప్పిదాల వలనే పర్యావరణం కలుషితమై ప్రమాదంగా మారుతుందని జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ బాపట్ల జిల్లా కో–ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి అన్నారు. జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి విజయవాడ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గత 200 ఏళ్లలో పారిశ్రామీకరణ వలన జనాభా పెరుగుల కారణంగా పర్యావరణ సమతౌల్యం భంగపడడమే కాకుండా గ్లోబల్ వార్మింగ్ పెరిగి తీవ్ర దుష్ప్రభావాలకు దారితీస్తుందన్నారు. పర్యావరణాన్ని రక్షించేందుకు మొక్కలు నాటడం, చెట్లను సంరక్షించడం విద్యార్థులు అలవాటు చేసుకోవాలన్నారు. కాలుష్యాన్ని తగ్గించి ఆక్సిజన్ విడుదల చేసే చెట్లను గురించి అందరికి తెలియచేయాలన్నారు. విద్యార్థుల చేత పర్యావరణ క్లబ్‌లు ఏర్పాటు చేయించడం, కంపోస్టు ఎరువు తయారీ వంటి వాటిని ప్రోత్సహించాలన్నారు. పాఠశాలల్లో పార్కులు పెంచి మొక్కలు నాటాలన్నారు. కాగిత వినియోగాన్ని సరైన క్రమంలో అలవాటు చేసుకోవడం, కాగితానికి రెండు వైపులా రాయాలన్నారు. ప్లాస్టిక్ సంచుల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగం పట్ల అవగాహన పెంచాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.ధనమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంతో పదునెక్కిన భూములు

బల్లికురవ: రుతుపవనాలు ప్రవేశంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి మెట్ట, మాగాణి భూములు పదునెక్కాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కూకట్లపల్లి గొర్రెపాడు, కొప్పరపాడు, వైదన గ్రామాల్లో సాగు చేసిన తిరునాళ్లలో నల్లచెరుకు ఈ వర్షానికి జీవం పోసుకుని కళకళలాడుతున్నాయి. మే మొదటివారం, రెండవారంలో పైగ్రామాల్లో చెరుకుసాగు చేపట్టారు. పచ్చిరొట్ట పైర్లయిన జనుము, జీలుగ, పిలిపెసర సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. భూములు పదునెక్కడంతో దుక్కులు దున్ని పచ్చిరొట్ట విత్తనాల సాగుకు ఇది మంచి అదునని వ్యవసాయాధికారి ఎస్వీపీ కుమారి తెలిపారు. పచ్చిరొట్ట పైర్లసాగుతో భూసారం పెరుగుతుందని కమారి తెలిపారు.


కూకట్లపల్లిలో కళకళలాడుతున్న చెరుకు

బీర్ సీసాతో స్నేహితుడిపై దాడి

మార్టూరు: మద్యం తాగుతున్న ఇద్దరు స్నేహితుల మధ్య మాటమాట పెరిగి ఓ యువకుడు రెండో వ్యక్తిని బీరు సీసాతో దాడి చేసిన ఘటన మార్టూరులో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. మార్టూరుకు చెందిన కళ్యాణ్, మస్తాన్ ఇద్దరు స్నేహితులు. స్థానిక కొణిదెన రోడ్డులో మద్యం తాగుతున్న ఇద్దరు స్నేహితుల మధ్య గతంలో కళ్యాణ్ మస్తాన్‌పై పెట్టిన కేసు విషయమై చర్చించుకుంటూ మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో మస్తాన్ చేతిలో ఉన్న బీరు సీసాతో కళ్యాణ్ తలపై బలంగా కొట్టాడు. తలకు గాయమైన కళ్యాణ్ ను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం చిలకలూరిపేట 108 సిబ్బంది కళ్యాణ్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు మస్తాన్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలి

చీరాల రూరల్: హెచ్ఐవీ గురైన భార్యాభర్తలు కానీ మరే ఇతర వ్యక్తులుగాని వైద్యుల సలహాల మేరకు క్రమం తప్పకుండా మందులు వాడుతూ మంచి బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే ఆరోగ్యవంతులుగా జీవిస్తారని ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఏఆర్‌టి సెంటర్లో హెచ్ఐవీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడారు. హెచ్ఐవీ అంటువ్యాధి కాదని దానికి గురైనవారిని ఈసడించుకుంటూ దూరంగా ఉంచవద్దని సూచించారు. అవగాహన సదస్సులో ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ హరిబాబు, ఏఆర్టీ మెడికల్ సిబ్బంది, మహిళా మండలి టీఐ ఎన్‌జీవో సిబ్బంది, వీహెచ్ఎస్, విహాన్ షేర్ ఇండియా సిబ్బంది, వైఆర్‌జి కేర్, సాతి ప్రోగ్రాం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే మంచి విద్య


నక్కబొక్కలపాడులో అడ్మిషన్లకై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు, ప్రిన్సిపాల్

బల్లికురవ: అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణలో ఒత్తిడిలేని విద్యను అందిస్తున్న బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని ప్రిన్సిపల్ ఎం అనిల్ కుమార్ కోరారు. సోమవారం నక్కబొక్కలపాడు గ్రామంలో పదో తరగతి పాసైన విద్యార్థులను కళాశాలలో చేర్పించాలని స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ తెలుగు ఇంగ్లిషు మీడియంలలో బోధనలతో రెండున్నర దశాబ్దాలుగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. మొదటి సంవత్సరం అడ్మిషన్లతోపాటు తరగతులు నిర్వహిస్తున్నామని అతి తక్కువ ఫీజు ఉచిత పాఠ్య పుస్తకాలతోపాటు ఆగస్టు నుంచి ఫిబ్రవరి వరకు ఉదయం సాయంత్రం స్టడీ అవర్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వివరించారు. పేద విద్యార్థులకు తాను, అధ్యాపకులు చేయూతనిస్తున్నామని చెప్పారు. ఈక్యాంపెయిన్‌లో అధ్యాపకులు పాల్గొన్నారు.

హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవు


బల్లికురవలో దుకాణాలు మూయిస్తున్న సీఐ


చీరాలలో మూసేసిన దుకాణాలు


స్వర్ణలో దుకాణాలు మూయించిన ఎస్సై, సిబ్బంది


నిర్మానుష్యంగా మారిన చీరాలలోని మసీదు సెంటర్

కారంచేడు: అన్ని గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నందున నిబంధనలు ఎవ్వరూ మీరవద్దని ఎస్సై కే సురేష్ హెచ్చరించారు. సోమవారం ఆయన మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ గ్రామాల్లో పర్యటించారు. సాయంత్రం 5 గంటల నుంచే గ్రామాల్లో 144 సెక్షన్‌ను అమలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడా ముగ్గురు, నలుగురు వ్యక్తులు మించి గుమ్మికూడవదన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల కౌంటింగ్‌ను ఇంటి వద్దనే ఉండి వీక్షించుకోవాలన్నారు. రోడ్ల పైకి వచ్చి గుమ్మికూడి కౌటింగ్‌లపై చర్చించుకోవడం, గొడవలు పడటం వంటివి చేయవద్దన్నారు. ప్రతి ఒక్క షాపును ఆయన మూయించి వేశారు. సోమవారం సాయంత్రం నుంచి 6వ తేదీ వరకు గ్రామాల్లో 30 పోలీసు యాక్ట్ కూడా అమలులో ఉంటుందన్నారు. దుకాణాలు కూడా ఎవరూ తెరిచి ఉంచవద్దన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం..

బల్లికురవ: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా జిల్లాలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని సంతమాగులూరు సీఐ కె. నరసింహారావు అన్నారు. సోమవారం రాత్రి స్థానిక నాలుగు రోడ్ల కూడలిలోని వ్యాపారులతో ఆయన మాట్లాడారు. ఒకరిద్దరు మించి ఎక్కువ మంది కనబడితే కేసులు నమోదు చేస్తామని మంగళవారం అర్ధరాత్రి వరకు దుకాణాలు తీయవద్దని సీఐ కోరారు. సోమవారం బల్లికురవ, వేమవరం గ్రామాల్లో ప్రజలకు అవగాహన మండలంలో మైకుల ద్వారా ప్రచారం చేపట్టటంతో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి సహకరించారు. కౌంటింగ్ తదుపరి బాణా సంచా కాల్చడం, అల్లర్లకు పాల్పడటం ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై రవిశంకర్‌రెడ్డి, స్టేషన్ రైటర్ ఆంజనేయులు సిబ్బంది పాల్గొన్నారు.

చీరాలలో దుకాణాలు బంద్..

చీరాల రూరల్: ఎన్నికల కమిషన్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ హెచ్చరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ చీరాల పట్టణంలో 144 సెక్షన్ విధించామన్నారు. అంతేగాక పోలీస్ 30 యాక్ట్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి గొడవలు జరుగకుండా ఉండేందుకు, అందులో భాగంగా పట్టణంలో సాయంత్రం 5 సాయంత్రం గంటల నుంచి మందులు, డైరీలు మినహా అన్ని షాపులు మంగళవారం రాత్రి వరకు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పట్టణంలోని గడియార స్తంభం సెంటర్ కోట్లబజారు, ముంతవారి సెంటర్, బస్టాండ్ రైల్వే స్టేషన్ లతో పాటు, రైలు పట్టాల అవతల ఫైర్ ఆఫీస్ గేటు హరిప్రసాద్ నగర్, పేరాల కారంచేడు రైల్వే గేటు తదితర ప్రాంతాలలో పోలీసులు వాహనాలను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

పొగాకు ఉత్పత్తులతో అనర్థాలు


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సుభాషిణి

చీరాల రూరల్: పొగాకు ఉత్పత్తి కారకాల వలన అనేక అనర్థాలు ఉత్పన్నమవుతాయని ముఖ్యంగా మానవ శరీరంలోని అవయవాలు పాడవుతాయని చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుభాషిణి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పొగాకు నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. సుభాషిణి మాట్లాడారు. పొగాకు ఉత్పత్తి కారకాలైన పాన్‌పరాగ్, గుట్కాలు, పాన్‌మసాలాలు, సిగరెట్లు, ఆల్కహాలు వంటివి మానవ శరీరానికి హాని కలిగిస్తాయని చెప్పారు. అలానే సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల చట్టం–2003ను కఠినంగా అమలుపరచడం కోసం తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ హరిబాబు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ పృథ్వీ, డాక్టర్ రవిప్రకాష్, డాక్టర్ దినేష్, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ కోటినాగిరెడ్డి, జిల్లా పొగాకు నియంత్రణ అధికారి బి. రమేష్, నర్సింగ్ స్టాఫ్, సిబ్బంది పాల్గొన్నారు.